## టీయూలో నేడు విద్యాదినోత్సవం

డిచ్‌పల్లి, జూన్ 19 : టీయూలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు (మంగళవారం) విద్యా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆచార్య ఆరతి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో 'తెలంగాణలో విద్యా విధానం – తీరు తెన్నులు' అంశంపై పోటీలు ఉంటాయని, ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాలులో ఉదయం 11 గంటలకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

## 24న దుబ్బాకలో అంగడి ప్రారంభం

ధర్పల్లి, జూన్ 19 : మండలంలోని దుబ్బాకలో ఈ నెల 24 నుంచి ప్రతి శనివారం అంగడి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వీడీసీ చైర్మన్ నూకల రమేశ్, ఉపసర్పంచ్ ప్రతాప్‌గౌడ్, వీడీసీ సభ్యుడు సంతోష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ కూడలి వద్ద ఏర్పాట్లు చేశామని, ప్రతి శనివారం అంగడి ఉంటుందని పేర్కొన్నారు. వ్యాపారులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## యువకులకు క్రికెట్ కిట్ల అందజేత

ఇందల్వాయి, జూన్ 19 : మండలంలోని గౌరారం వడ్డెర కాలనీకి చెందిన యువకులకు మాజీ ఎంపీపీ, ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇమ్మడి గోపి క్రికెట్ కిట్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల వైపు మొగ్గుచూపాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక యువకులు పాల్గొన్నారు.

## మండల కాంప్లెక్స్ భవన నిర్మాణ పనుల పరిశీలన



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు నారోజి గంగారాం

రుద్రూర్, జూన్ 19 : మండలకేంద్రంలో కొనసాగుతున్న మండల కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను జడ్పీటీసీ సభ్యుడు నారోజీ గంగారాం సోమవారం పరిశీలించారు. భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో బాలగంగాధర్, విండో చైర్మన్ సంజీవ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## 24, 25వ తేదీల్లో ఇన్సాఫ్ రాష్ట్ర మహాసభలు

ఖలీల్‌వాడి, జూన్ 19 : జహీరాబాద్‌లో ఈనెల 24, 25వ తేదీల్లో మైనార్టీ సంఘం ఇన్సాఫ్ మహాసభలను నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ తెలిపారు. సీపీఐ కార్యాలయంలో అర్బన్ నియోజకవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులు మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ అర్బన్ నియోజకవర్గ కార్యదర్శి వై.ఓమయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఇన్సాఫ్ అర్బన్ నియోజకవర్గ కమిటీ ఎన్నిక**

అధ్యక్షుడిగా ఇమ్రాన్‌అలీ, ఉపాధ్యక్షులుగా లాయఖ్, వాజిద్, కార్యదర్శిగా ఫిరోజ్‌అలీ, సహాయ కార్యదర్శులుగా జాఫర్, అఫ్సర్‌ఖాన్, సలావుద్దీన్‌తో పాటు 15 మందితో కమిటీ ఎన్నుకున్నారు.

## పారిశుద్ధ్య కార్మికుడి మృతి

- **అంత్యక్రియల కోసం రూ. 20 వేలు అందజేసిన సర్పంచ్**

కోటగిరి, జూన్ 19 : కోటగిరి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసే బేగరి సాయిలు సోమవారం బంగ్లాపై నుంచి పడి మృతిచెందాడు. సర్పంచ్ పత్తి లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి రాజేందర్, వార్డుసభ్యులు యార్లగడ్డ రవి, దయానంద్, అర్షద్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం సర్పంచ్ పత్తి లక్ష్మణ్ స్పందించి రూ.20 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థికి సన్మానం

డిచ్‌పల్లి, జూన్ 19 : మండలంలోని వెస్లీనగర్ తండాకు చెందిన బోడ రాజేశ్ జేఈఈ అడ్వాన్స్‌డ్ –2023లో 396 ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా రాజేశ్‌ను సర్పంచ్ సునీతా రఘు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్పీకర్‌తో కృషితో గ్రామాల అభివృద్ధి



ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి

కోటగిరి, జూన్ 19 : స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కృషితో బాన్సువాడ నియోజకవర్గంలోని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎత్తొండ గ్రామంలో రూ. 30 లక్షల నిధులతో చేపట్టే ఫంక్షన్ హాల్‌తోపాటు పలు కమ్యూనిటీ హాళ్ల భవన నిర్మాణ పనులకు ఆయన సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరిగిరి సాయిబాబా, ఎంపీటీసీ సభ్యుడు ఫారూఖ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఎజాజ్‌ఖాన్, మాజీ వైస్ ఎంపీపీ వల్లెపల్లి శ్రీనివాసరావు, అగ్గు హన్మంత్, ఆనంద్, కిశోర్‌చంద్ర, వెంకటేశ్, విఠల్, విండో చైర్మన్ ఆశోక్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో మునిగి యువకుడి మృతి

రుద్రూర్, జూన్ 19 : మండలకేంద్రంలోని ఊర చెరువులో బర్ల శ్రావణ్ (23) ఈతరాక నీటిలో మునిగి ఊపిరాడక మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బర్ల శ్రావణ్ పుట్టుకతో మూగ వ్యక్తి. వ్యవసాయ పనులతోపాటు గేదెలు కాసేందుకు వెళ్లేవాడు. సోమవారం గేదెలు కాసేందుకు వెళ్లాడు. రుద్రూర్ చెరువులోకి గేదెలు వెళ్లగా.. వాటిని బయటికి తరిమేందుకు చెరువులోకి దిగాడు. ఈత రాక నీటిలో మునిగి ఊపిరాడకపోవడంతో గమనించిన తోటికాపరులు చెరువులోకి దిగి కాపాడేందుకు ప్రయత్నించారు. అప్పటికే మృతిచెందగా.. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి తండ్రి బర్ల సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వ దవాఖాన నుంచి ఒకరి అదృశ్యం



సుధాకర్

నిజామాబాద్ క్రైం, జూన్ 19 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఆరు రోజుల క్రితం చికిత్స నిమిత్తం అడ్మిట్ అయిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బీ)గ్రామానికి చెందిన మనపల్లి సుధాకర్ అనారోగ్యం కారణంగా ఈ నెల 13వ తేదీన జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స చేయించుకునేందుకు అడ్మిట్ అయ్యాడు. సోమవారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో సదరు వ్యక్తి ఎవరికీ చెప్పకుండా దవాఖాన నుంచి బయటికి వెళ్లారు. సుధాకర్ ఇంటికి వెళ్లకపోవడం, ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య అనసూయ సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై హబీబ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఫొటోలో ఆధారంగా ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో– 87126–59837, ఎస్సై– 93926–74315 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

## రేపు డైట్ సెట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

ఖలీల్‌వాడి, జూన్ 19 : డైట్‌సెట్‌లో అర్హత సాధించిన తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియం అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత పత్రాలతో జిల్లాకేంద్రంలోని నాగారంలో ఉన్న డైట్ కళాశాలలో హాజరుకావాలని, మరిన్ని వివరాల కోసం 9966509891, 6309535759 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

## కొనసాగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులు



మండల కేంద్రంలో కొనసాగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులు

ఏర్గట్ల, జూన్ 19 : మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సహకారంతో మండల కేంద్రమైన ఏర్గట్లలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రూ.5 కోట్ల నిధులతో రోడ్డు విస్తరణ, డివైడర్ల ఏర్పాటు, సెంటల్ లైటింగ్ పనులు కొనసాగుతున్నాయి. సెంట్రల్ లైటింగ్ విద్యుత్ వైర్ల రక్షణ పైపులు, రోడ్డుకు ఇరు వైపులా నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, తీగల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. దీంతో మండలప్రజలు హర్షం వక్తం చేస్తూ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## కుటుంబకలహాలతో మహిళ ఆత్మహత్య

ధర్పల్లి, జూన్ 19 : మండలకేంద్రానికి చెందిన బండి పద్మ (40) చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బండి పద్మ కుటుంబకలహాల కారణంగా భర్త లక్ష్మీనర్సయ్యతో గొడవపడి ఈనెల 10న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తమ్ముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## శ్రీరాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్



ఎస్సారెస్పీ ప్రాజెక్టును సందర్శిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

మెండోరా, జూన్ 19 : జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టును కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం సందర్శించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోచంపాడ్‌లో సంపదవనాన్ని ప్రారంభించిన అనంతరం శ్రీరాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు నీటి నిల్వ, గత సీజన్‌లో వచ్చిన ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు వరదగేట్లు, కాకతీయ హెడ్‌రెగ్యులేటర్లను పరిశీలించారు. జల విద్యుదుత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పత్తి విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌ను ఎస్ఈ శాలువాతో సన్మానించారు. ఈఈ చక్రపాణి, సర్పంచ్ మిస్రా, డీసీవో సింహాచలం, పీడీ చందర్‌నాయక్, ఓఎస్డీ విజయేందర్‌రెడ్డి, రామాలయ చైర్మన్ నరహరి, ఏఈ వంశీ, డీఈ గంగాకిషన్, బీఆర్ఎస్ నాయకుడు ఖాదర్ ఉన్నారు.



నాడు





నేడు

## పాఠశాలల్లో ఆధునిక వసతులు

ఆర్మూర్, జూన్ 19 : సమైక్య పాలనలో వివక్షతతో కనీస వసతులు లేక అధ్వాన స్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు.. స్వరాష్ట్రంలో మన ఊరు –మన బడి కార్యక్రమం ద్వారా కొత్తరూపును సంతరించుకున్నాయి. ఆర్మూర్ మండలం మామిడిపల్లి ప్రాథమిక పాఠశాలలో అపరిశుభ్రంగా ఉన్న ట్యాంకు వద్దనే విద్యార్థులు భోజనాలు చేసి చేతులు కడుక్కొని, నీరు తాగేవారు వారు. ప్రస్తుతం మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.20 లక్షల వ్యయంతో పాఠశాల రూపు మారిపోయింది. ప్రస్తుతం వాటి స్థానంలో నూతన హంగులతో తాగునీరు, చేతులు కడుక్కునే నీటిని వేర్వేరుగా ఏర్పాటు చేసి సురక్షితమైన నీటిని అందిస్తున్నారు. దీంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.